## డాక్టరేట్ పొందిన భానుప్రకాశ్‌కు అభినందనలు



భానుప్రకాశ్

వనపర్తి టౌన్, డిసెంబర్ 1 : వనపర్తి జిల్లావాసి అంబటి భానుప్రకాశ్ డాక్టరేట్ పట్టాను అందుకోవడంపై సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాచ్య భాషల విభాగం(తెలుగు)లో డాక్టర్ చవ్వా వెంకటరెడ్డి పర్యవేక్షణలో 'వనపర్తి జిల్లా సాహిత్యం ఒక పరిశీలన' అనే ఆంశంపై పరిశోధన చేశారు. ఈ నెల 24న విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు భానుప్రకాశ్‌కు డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని దుప్పల్లి గ్రామానికి చెందిన భానుప్రకాశ్ జిల్లాకు సంబంధించిన పలు సాహిత్య అంశాలపైన పరిశోధన చేసి నూతన అంశాలను వెలు వరించారని ఆయన కొనియాడారు. జిల్లావాసికి డాక్టరేట్ రావడంపై సాహితీ వేత్తలు కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి, కందూరు నారాయణరెడ్డి, డాక్టర్ వీరయ్య, బైరోజు చంద్రశేఖర్, డాక్టర్ తూర్పింటి నరేశ్‌కుమార్, డాక్టర్ శ్యాంసుందర్, బండారు శ్రీనివాస్, ఉప్పరి తిరుమలేశ్ తదితరులు ఉన్నారు.

## 'నిరంజన్‌రెడ్డి గెలుపు ఖాయం'

పెబ్బేరు, డిసెంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల్లో వనపర్తి నుంచి బీఆర్‌ఎస్ తరపున పోటీ చేసిన మంత్రి నిరంజన్‌రెడ్డి గెలుపు ఖాయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గానికి మంత్రి చేసిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాలు ఆయన గెలుపునకు నాంది పలుకుతాయని తెలిపారు. పోలింగ్‌లో ఓటర్లు బీఆర్‌ఎస్‌కే పట్టం కట్టనున్నట్లు, తిరిగి రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు కానున్నట్లు స్పష్టమవుతోందన్నారు. పార్టీ కోసం ప్రచారం నిర్వహించి, ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు వనం రాములు కృతజ్ఞతలు తెలిపారు.

## డ్రైనేజీల్లో తొలగించిన చెత్తను తరలించాలి

అమరచింత, డిసెంబర్ 1 : పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది డ్రైనేజీల్లో తొలగించిన చెత్తను అక్కడి నుంచి తరలించాలని ఆయా వార్డుల ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టణంలోని ఆరు, ఏడు వార్డుల్లోని డ్రైనేజీల్లో పక్షం రోజుల కిందట చెత్తను తొలగించిన సిబ్బంది అక్కడే వదిలివేయడంతో కోళ్లు, కుక్కలు ప్రతి రోజూ ఆచెత్తను చిందర వందరగా చేయడంతో రోడ్లపై దుర్వాసన వెదజల్లుతుందన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చొరవ తీసుకొని తొలగించిన చెత్తను సిబ్బందితో తరలించాలని ఆయా కాలనీలవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు

ఆత్మకూరు, డిసెంబర్ 1: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్‌లో పాల్గొన్న ఓటర్లకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మండలం వ్యాప్తంగా 73.04ఓటింగ్ శాతం నమోదు కావడంపై సంతోషం వెలిబుచ్చారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ హర్షం వ్యక్తంచేస్తూ ఓటర్లందరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో 72.08 శాతం నమోదు కావడంపై మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రీయాదవ్, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి హర్షం ప్రకటించారు. పట్టణంలోని 11 పోలింగ్ బూత్‌లలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సకల ఏర్పాట్లు నిర్వహించినట్లు చెప్పారు. కమిషనర్ నేతృత్వంలో పోలింగ్‌కేంద్రాల పర్యవేక్షణ సాగినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ జరిగేందుకు సహకరించిన ఓటర్లు, మున్సిపల్ సిబ్బంది, పోలీసు సిబ్బందికి వారు ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు తెలిపారు.

## సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు

మదనాపురం, డిసెంబర్ 1 : ఎన్నికల్లో పోలీస్‌శాఖకు సహకరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు చోటివ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకున్న మండల ప్రజలకు ఎస్సై మురళి శుక్రవారం ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఆరోజు కూడా పోలీస్ శాఖకు ఇలాగే సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ప్రజల సహకారంతోనే ఎన్నికలు ప్రశాంతం

అమరచింత, డిసెంబర్ 1 : ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకొని పోలీసులకు సహకరించిన మండల ప్రజలు, వివిధ రాజకీయపార్టీల నాయకులు, తమ సిబ్బంది, మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులకు ఎస్సై జగన్‌మోహన్ శుక్రవారం ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీ రక్షితామూర్తి, డీఎస్పీ ఆనంద్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎక్కడికక్కడ సభలు సమావేశాలు నిర్వహించి ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించామన్నారు. అలాగే ఆత్మకూర్ సీఐ కేఎస్ రత్నం సూచనల మేరకు కొత్తకోట ఎస్సై నాగశేఖర్‌రెడ్డి, తమ సిబ్బందితో కలిసి వివిధ గ్రామాల్లో ఎన్నికల బందోబస్త్ నిర్వహించారన్నారు. ప్రజలు, రాజకీయ నాయకుల సహకారంతోనే ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, వారందరికీ ఎస్సై జగన్ మోహన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఎయిడ్స్ రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్

వనపర్తి, డిసెంబర్ 1 : ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యసేవలు అందించడమేక కాక వారికి మనోధైర్యం కల్పించాలని డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని మెడిసిన్ స్టోర్ కేంద్రంలోని జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వైద్యసేవలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రోగాం ఆధికారి సాయినాథ్‌రెడ్డితో కలిసి డీఎంహెచ్‌వో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగం వచ్చిన వారికి వైద్యంతోపాటు వారిలో మనోధైర్యం కల్పించేలా సేవలను అందించాలన్నారు. అలాగే మందులతోపాటు పౌష్టికాహారం, శారిరక వ్యాయామం, యోగా తదితర వాటిని చేసేలా సూచనలు అందించాలన్నారు. వారికి వచ్చిన రోగంపై భయపడకుండా సహజ జీవనం చేసేలా వారికి ప్రోత్సా హం అందించాలన్నారు. తల్లి గర్భవస్థ దశలో డాక్టర్ సలహాలు పాటిస్తే బిడ్డకు వచ్చే అవకాశం 2శాతం వరకు తగ్గించవచ్చుని అన్నారు. పుట్టిన బిడ్డకు 6 వారాలు, 6 నెలలు, 12 నెలలు,18 నెలలకు ఒక్కసారి పరీక్షలు చేయించాలన్నారు. ముందస్తుగానే ప్రతి గర్భిణికి హెచ్ఐవీ పరీక్ష తప్పనిసరిగా చేయించాలన్నారు. ఈ పరీక్షలు అన్ని ప్రభుత్వ దవాఖానల్లో ఉచితంగా అందజేస్తారన్నారు.అనంతరం ఎయిడ్స్ రోగులకు అత్యుత్తమ సేవలందించిన వారికి మె మెంటో, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పరిమళ, మంజుల, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు , మాస్ మీడియా అధికారి చంద్రయ్య, హెచ్ఈ మధు, సూపర్‌వైజర్లు నర్సింగ్‌రావు, మహేశాచారి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాఝాన్సీభాయి, ఏవో శ్రీధర్‌రెడ్డి, క్షయ వ్యాధి సూపర్‌వైజర్స్, ఏఎన్ఎంలు, డీఎంహెచ్‌వో సిబ్బంది పాల్గొన్నారు.




ఎయిడ్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్



వీపనగండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం

## ఎయిడ్స్ రోగులను ఆదరించాలి

వీపనగండ్ల, డిసెంబర్ 1: మండలకేంద్రంలో ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని రోగులను సేవా భావంతో ఆదరించాలన్నారు. ఎయిడ్స్ రోగులపై వివక్ష చూపరాదన్నారు. ఎయిడ్స్ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఏ ఊళ్లో.. ఎన్ని ఓట్లు..

- మండల వ్యాప్తంగా 79.04శాతం నమోదు
- అత్యధికంగా మోట్లంపల్లిలో 88.48శాతం
- ఆత్మకూరు 216పోలింగ్ బూత్‌లో అత్యల్పం

ఆత్మకూరు, డిసెంబర్ 1: 2023 అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. మండలం వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. మండలం వ్యాప్తంగా 30,563 ఓట్లు ఉండగా 79.04 శాతం ఓటింగ్ నమోదైంది. గత ఎన్నికల్లో 81.56 శాతం నమోదుకాగా ఈ ఏడాది ఓటింగ్ 2 శాతం తగ్గింది. ఇదిలా ఉండగా ఏ గ్రామంలో ఎన్ని ఓట్లు పడ్డాయని పరిశీలిస్తే మూలమల్ల 1932 ఓట్లకు గానూ 1577పోల్ కాగా 81.62 శాతం నమోదైంది. జూరాలలో 1906కుగానూ 1595ఓట్లు పోల్ కాగా 83.06శాతం నమోదైంది. గుంటిపల్లిలో 929ఓట్లకు గానూ 812 పోల్ కాగా 87.41 నమోదైంది. మోట్లంపల్లిలో 1459కు గానూ 1291 పోల్‌కాగా 88.48 నమోదైంది. ఆరెపల్లిలో 1984కు గానూ 1655 పోల్‌కగా 83.41 నమోదైంది. కత్తెపల్లిలో 1213కు గానూ 1021 పోల్‌కాగా 84.17 నమోదైంది. తూంపల్లిలో 622కు గానూ 545 పోల్ కాగా 87.62 నమోదైంది. వీరరాఘవపూర్‌లో 355కు గానూ 299 పోల్‌కాగా 84.23 నమోదైంది. రేచింతలలో 1660కు గానూ 1305 కాగా 78.61శాతం నమోదైంది. తిప్డంపల్లిలో 2514కు గానూ 1867 పోల్‌కాగా 74.26శాతం నమోదైంది. దేవరపల్లిలో 1108కు గానూ 968 పోల్‌కాగా 87.36 నమోదైంది. మేడెపల్లిలో 954కుగానూ 819 పోల్‌కాగా 85.85శాతం నమోదైంది. 11,194ఓట్లకు గానూ 8069 ఓట్లు పోల్ కాగా 72.08శాతం నమోదైంది. బాలకిష్టాపూర్‌లో 1250కుగానూ 1046 పోల్ కాగా 83.68 నమోదైంది. పిన్నెంచెర్లలో 1483కు గానూ 1289 పోల్‌కాగా 86.09శాతం నమోదైంది. మండలవ్యాప్తంగా 30,563 ఓటర్లకు గానూ 24,158 ఓట్లు పోల్ కాగా 79.04శాతం నమోదైంది. ఇందులో 15,209మంది పురుషులకు 12,216 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 15,352 మంది మహిళలకు 11942 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా మోట్లంపల్లి గ్రామంలో 88.48శాతం నమోదుకాగా, రెండోస్థానంలో తూంపల్లి 87.62శాతం నమోదైంది. అత్యల్పంగా ఆత్మకూరు పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలోని 216పోలింగ్ బూత్‌లో 65.90శాతం నమోదైంది. ఈ పోలింగ్‌బూత్‌లో 10వవార్డు రాజవీధికి చెందిన ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు.



ఆత్మకూరులో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు

# వెల్లివిరిసిన ఓటరు చైతన్యం

- పట్టణాల నుంచి భారీగా తరలొచ్చిన జనం



బున్యాదిపురంలో ఓటేసిన తర్వాత సిరా చూపుతున్న గ్రామస్తులు

పెబ్బేరు, డిసెంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ ఓటర్లు జై కొట్టారు. ఓటు వేయడం భారం కాదు..బాధ్యతగా భావించారు. అందుకే ఉదయం నుంచి సాయంత్రం దాకా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు కనిపించారు. పెబ్బేరు మండలంలోని కొన్ని గ్రామాల్లో పోలింగ్ ప్రారంభానికి కంటే ముందే కేంద్రాలకు చేరుకోవడం..పోలింగ్ ముగిసే సమయం దాటినా వారు క్యూలైన్లలో ఉండటం కనిపించింది. ప్రతి పోలింగ్ కేంద్రంలో మహిళలు, పురుషులకు వేర్వేరు క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. ఒకరి తర్వాత ఒకరిని ఓటేసేందుకు లోపలికి అను మతించారు. ఈనేపథ్యంలో ఓటు వేసేందుకు గంటకు పైగా క్యూలో వేచి ఉండాల్సి వచ్చింది. అయినప్పటికీ ఓటేసేంత వరకు వారు ఓపికగా నిలబడే ఉన్నారు. ముఖ్యంగా గ్రామాల నుంచి పట్టణాలకు వలస వెళ్లి న వారు ఓటు కోసం తిరిగొచ్చారు. ప్రతి గ్రామం నుంచి ఉపాధి నిమిత్తం వలస వెళ్లిన వారున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోనే ఎక్కువమంది ఉపాధి పొందుతుండగా.. కొంత మంది ఒక రోజు ముందుగా గ్రామాలకు చేరుకోగా, మరికొందరు పోలింగ్ రోజే వచ్చారు. దీంతో అన్ని గ్రామాల్లో సందడి వాతావరణం కనిపించింది. మండలంలో ఐదువేల మంది ఓటర్లు ఓటు కోసం పట్టణాల నుంచి వచ్చి ఉంటారని అంచనా. ఓటు ఒక బాధ్యతగా వారు వ్యయప్రయాసల కోర్చి వచ్చి ఓటేసి వెళ్లారు.